క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో సోమవారం ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ తెలిపారు. 50 ఏళ్లకు పైబడి దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్, రవాణా, భోజనం కల్పిస్తామన్నారు. ఆత్మకూర్, అమరచింత, నర్వ, మదనాపురం మండల పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్య స్నేహితుడి కుటుంబానికి చేయూత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి జంట గ్రామాల ఉన్నత పాఠశాలలో 1999 – 2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పి.సుధాకర్‌రెడ్డి, బి.కృష్ణారెడ్డి, కె.మద్దిలేటి, ఎస్.చిన్నరాములు ను శాలువాతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం తమతో పాటు చదువుకున్న చిన్ననాటి మిత్రుడు వెంకటేష్ మృతి చెందడంతో.. మృతుడి ఇద్దరు కుమార్తె పేరు మీద రూ.లక్ష డిపాజిట్ చేసి, అందుకు సంబంధించిన పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

అభివృద్ధిలో వనపర్తి ముందంజ



సాక్షి, నెట్‌వర్క్: జిల్లా కేంద్రంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పర్యటించడంతో జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషితో జిల్లాలో రూ.వెయ్యి కోట్ల పనులు మంజూరయ్యాయని కొనియాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వనపర్తి జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులకు మోక్షం లభించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తాను చిన్నతనంలో చదువుకున్న వనపర్తిపై అభిమానంతో రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి కేటాయించని నిధులు ఇక్కడికి మంజూరు చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.

సింగోటం ఆలయ అభివృద్ధిపై చర్చకు రావాలి

కొల్లాపూర్: సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చర్చకు రావాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు తమటం సాయికృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన దేవాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీ కవిత సింగోటం ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి మంజూరైన రూ.15 కోట్ల నిధులను మంత్రి జూపల్లి కృష్ణారావు రద్దు చేశారని ఆరోపించారు. ఇందులో వాస్తవమెంత అనే అంశాలపై కాంగ్రెస్ నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి మంజూరైన నిధులను రద్దు చేయించాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఆలయ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఆ నిధులను వెంటనే విడుదల చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. నిధుల మంజూరు, క్యాన్సిల్ అంశాలపై బహిరంగ చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

మంత్రి జూపల్లిపై దుష్ప్రచారం చేయడం తగదు

కొల్లాపూర్: కోడేరు మండలం నార్యానాయక్ తండాలో దాయాదుల మధ్య భూ పంచాయితీ కోసం స్వల్ప ఘర్షణ జరిగితే దానిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు అంటగట్టడం బీఆర్‌ఎస్ నాయకులకు తగదని మాజీ జెడ్పీటీసీ హన్మంతునాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు జూపల్లిపై అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో నాయకులు శంకర్‌నాయక్, గోపినాయక్ తదితరులు ఉన్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఆర్టీసీ బస్సులతో పాటు, ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. 10 వేల మంది భక్తులు హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ సంస్థవారు ప్రత్యేక బస్సులను నడిపారు.

అంబులెన్స్ లేక అవస్థలు

- పేరుకే 30 పడకల ఆస్పత్రి
- ప్రమాదం జరిగితే '108' కోసం ఎదురు చూడాల్సిందే..
- గతంలో గిఫ్టు కింద వచ్చిన 108 వాహనం ఎక్కడ?



జిల్లా ఆస్పత్రికి తరలించిన స్థానిక అంబులెన్స్



ఖిల్లాఘనపురం 30 పడకల ఆస్పత్రి.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ప్రారంభించి ఆరున్నరేళ్లు కావస్తున్నా కనీసం అత్యవసర సమయంలో ఉపయోగించేందుకు 108 అంబులెన్స్ కూడా ఏర్పాటు చేయలేదు. మండలంలో ఎక్కువగా కనీసం ప్రజా రవాణాకు కూడా నోచుకోని గిరిజన తండాలే అధికంగా ఉన్నాయి. తండాల్లో అనుకోని పరిస్థితిల్లో ఎవరికైనా అత్యవసరంగా వైద్య సేవలు అందించాల్సి వస్తే స్థానికంగా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

3 జిల్లాల ప్రజలకు ఉపయోగం

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 108 అంబులెన్సు ఏర్పాటు చేయడం వలన మండలంలోని 27 గ్రామాలతో పాటు పలు గిరిజనతండాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని గౌరారం, బీమునితండా తదితర గిరిజన తండాలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని మద్దిగట్ల, పాతమొల్గర, వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వీరాయిపల్లి, మంగంపల్లి, పామిరెడ్డిపల్లి, పలు గిరిజన తండాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. ఇక్కడ అంబులెన్స్ ఏర్పాటు చేయడం వలన మండలం చుట్టు కనీసం 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ ప్రమాదాలు జరిగినా రోడ్డు సౌకర్యం ఉండటంతో కేవలం 15 నిమిషాల్లో అంబులెన్స్ చేరుకునేందుకు అవకాశం ఉంది. పలు సందర్భాల్లో మండలం మీదుగా వెళ్లే వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డుపై వాహన ప్రమాదాలు జరిగితే ఇతర ప్రాంతాల నుంచి 108 అంబులెన్స్ రావడానికి గంటల సమయం పడుతుండడంతో ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. గతంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో గిఫ్ట్ కింద 108 వాహనం ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ వాహనం ఎక్కడ ఉందో తెలియదు.

ప్రమాదం జరిగిన అరగంటకు..



మండలంలో సుమారు 60 వేల జనాభా ఉంది. ప్రమాదాలు జరిగితే అడ్డాకుల తదితర ప్రాంతాల నుంచి 108 అంబులెన్స్ వచ్చి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే లోపు ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. మండలంలో ఓవ్యక్తి బైక్ ప్రమాదంలో కాలు విరిగి రోడ్డు మీద బాధతో అరుస్తున్నా సుమారు అరగంట దాటిన తర్వాత అంబులెన్స్ వచ్చింది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– మధు, ఖిల్లాఘనపురం

ఎక్కడికి వెళ్లింది



స్థానిక పీహెచ్‌సీకి గతంలో 108 వాహనం ఉండేది. ఇప్పుడు అది కనిపించడం లేదు. జిల్లా కేంద్రానికి ఎందుకు తీసుకెళ్లారు. జిల్లాలో దాదాపుగా అన్ని మండల కేంద్రాల్లోని ఆస్పత్రుల వద్ద అంబులెన్స్‌లు ఉన్నాయి. మారుమూల గ్రామాలకు సేవలు అందించే ఘనపురం పీహెచ్‌సీకి అంబులెన్స్‌ను అందించడంతో అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

– శివకుమార్, ఖిల్లాఘనపురం

అంబులెన్స్ అవసరమే..



ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పత్రికి 108 ఆంబులెన్సు ఏర్పాటు చేయడం వలన ఎంతో మంది ఉపయోగంగా ఉంటుంది. మూడు జిల్లా కేంద్రాలలోఎక్కడి కి వెళ్లాలన్న కనీసం గంట సమయం పడుతుంది. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ఆంబెలెన్సులు సకాలంలో అందడం లేదని పలుమార్లు మండల ప్రజలు తమ దృష్టికి తీసుకవచ్చారు.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ, ఖిల్లాఘనపురం

ఇబ్బందులు ఎదురవుతున్నాయి

ఖిల్లాఘనపురం మండలం వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు మధ్యలో ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా గిరిజనులు, నిరుపేదలు నివసిస్తున్నారు. 30 పడకల ఆస్పత్రి ఉన్నప్పటికీ 108 వాహనం లేకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

– డాక్టర్ పుల్లారెడ్డి, సీహెచ్‌సీ ఇన్‌చార్జ్

సీఎం రాకతో ట్రాఫిక్ కష్టాలు



వనపర్తిలో నిలిచిపోయిన ట్రాఫిక్

- వ్యాపార సముదాయాలను మూయించిన పోలీసులు
- బారికేడ్ల ఏర్పాటుతో వాహనదారులకు ఇబ్బందులు



మూసివేసిన దుకాణాలు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచే పోలీసులు పట్టణాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. సీఎం వల్లభ్‌నగర్, వేంకటేశ్వరస్వామి ఆలయానికి రావడంతో ఆ ప్రాంతాల నుంచి ప్రధాన మార్గాలకు వచ్చే రహదారులను బారికేడ్లతో మూసివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బస్టాండ్, రాజీవ్ చౌరస్తా, అంబేడ్కర్‌చౌక్, బస్ డిపో రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు మొదలుకొని ఆర్టీసీ బస్సుల వరకు రాకపోకలను నిలిపివేయడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. సీఎం పర్యటన వివరాలను ప్రజలు వీక్షించేలా పలు ప్రధాన చౌరస్తాలు, సభ స్థలంలో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడంతో వాటి ద్వారా సీఎం పర్యటనను ప్రజలు తిలకించారు.

వ్యాపారులకు తప్పని ఇబ్బందులు

పట్టణంలోని ప్రధాన రోడ్లు, చౌరస్తాల్లో ఉన్న వ్యాపార సముదాయాలను పోలీసులు పూర్తిగా మూసివేయించారు. ఆదివారం సంత కావడంతో పాటుగా సీఎం పర్యటన నేపథ్యంలో వ్యాపారం భారీగా జరిగే అవకాశం ఉందని టీ స్టాల్, టిఫిన్ సెంటర్లు మొదలుకొని అన్ని దుకాణాలను తెరిచారు. పోలీసులు అత్యవసర సేవలు అందించే దుకాణాలను మినహాయించి అన్నింటిని మూసేయడంతో వ్యాపారాలు ఏ మాత్రం చేసుకునేందుకు వీలులేకుండా పోయింది. గతంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమీప దుకాణాల వరకు మాత్రమే బంద్ చేయించేవారు. అందుకు భిన్నంగా వనపర్తిలో దాదాపు 60శాతానికి పైగా దుకాణాలు మూసివేయడంతో వ్యాపారులు ఇదేమీ చోద్యం అని పెదవి విరిచారు.

రూ.400 కోట్ల నిధులు విడుదల చేయండి

గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో సీసీ డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణాలు మున్సిపాలిటీ పరిధిలో చేపట్టామని, ఇందుకు సంబంధించి రూ. 400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వనపర్తి మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పెండింగ్‌లో ఉన్న నిధులను ఉగాదిలోపు విడుదల చేయించాలని ముఖ్యమంత్రిని కాంట్రాక్టర్లు అభ్యర్థించారు. దీంతో పాటుగా బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం



పాన్‌గల్: గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గిరిజనులతో కలిసి ఉద్యమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్ అన్నారు. స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వేలో భాగంగా ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండా, అన్నారంతండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాల్లో సరైన పనులు లేక గిరిజనులు వలసలు వెళ్తున్నారన్నారు. గిరిజనులకు కేటాయించాల్సిన బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిధులు కేటాయించడం లేదని వాపోయారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం ఎంపికైన లబ్ధిదారులకు నిధులు లేక నేటికీ రుణాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో బాబునాయక్, చిట్టెమ్మ, రవినాయక్ పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కలిసి పనిచేద్దాం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాన్‌గల్: మాదిగ ఉద్యోగుల జాగృతి సంఘం బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని మాదిగ ఉద్యోగుల జాగృతి మండల నాయకులు చిన్నపాగ నర్సింహ, అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని మాందాపూర్‌లో సంఘం క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంఘానికి ప్రాణం పోసి నిలబెట్టి రాబోయే తరాలకు అందించడానికి మాదిగ పెద్దలు, ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సంఘంలో సమస్యలు, బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు సంఘంలో చర్చించి ప్రణాళికలను సిద్ధం చేస్తూ దానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయ్,శివ, రాజు, మాధవి, బాలరాజు, పుల్లయ్య, బాలస్వామి, వెంకటేష్, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు దేవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త అనిత తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి అంకురార్పణ



ఆలయ నిర్మాణానికి చేస్తున్న భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్న ప్రదేశంలో బ్రహ్మశ్రీ గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఆగమశాస్త్ర పండితులు శ్రీనందివెలుగు బ్రహ్మశ్రీ బాలాజీ గురుకుల్ వారి బృందం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా స్థల సంప్రోక్షణ లక్ష్మీగణపతి హోమం, వాస్తు హోమం, నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలతో యంత్రస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని పూజలు చేశారు. ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవం కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, పి.విశ్వేశ్వర్, అయ్యప్ప ఆలయ నిర్మాణ నిర్వాహకులు లింగేశ్వర్, విశ్వనాథం గంగాధర్, గుంత ప్రకాష్, గుంత మల్లేష్, బీమ కిషోర్‌కుమార్, గుంత కళ్యాణ్, సత్యం సాగర్, లక్ష్మీనారాయణ యాదవ్, రాజశేఖర్, నరేందర్‌రెడ్డి, కవీందర్‌రెడ్డి, భీమ రాజు, ధన్వాడ వెంకటేష్, శివకుమార్‌రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నితిన్ చారి, రాఘవేంద్ర, నరేష్, శ్రీనివాసులు, భాస్కర్, రవి గౌడ్, పెంటన్న, విశ్వమోహన్‌చారి, బీమ చంద్రకాంత్, భీమ రవి, సతీష్‌కుమార్, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీతను ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

కొత్తకోట రూరల్: ఫాల్గుణ మాసం ప్రారంభం సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట, పెబ్బేరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను ఆదివారం కొత్తకోట మండలంలోని పామాపురం గ్రామంలో ఇంటింటా పరిచయం చేసినట్లు ఆ కమిటీల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర్ణమి, హోలీ, హిందూ పండుగలపై అవగాహన కల్పించారు. ప్రతి పండుగ రోజు దేవుడి గురించి తెలుసుకోవాలని, సర్వ మానవాళికి సమన్వయ జ్ఞానాన్ని అందించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్‌రెడ్డి, ముజాఫర్‌ఖాన్, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితరులు ఉన్నారు.

'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

అమరచింత: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎండిపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో ఆదివారం రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎరువులపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఎత్తేసి అన్నదాతలపై భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధరను కల్పించి మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు దళారుల చేతిలో నేటికీ మోసపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మోహన్, రాజు, శంకర్, నాగరాజు, చంద్రాయుడు, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో విద్యార్థి సంఘాల నాయకులు

అమరచింత: జిల్లా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని ఏబీవీపీ, పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, విద్యార్థి సంఘాల నాయకులతో పాటు వామపక్ష పార్టీలకు చెందిన యువజన సంఘాల నాయకులను సైతం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఈమేరకు విద్యార్థి సంఘాల నాయకులతో పాటు యువజన సంఘాల నాయకులు రాకేష్, ఉదయ్, రాఘవ, వెంకటేష్, రాజు, కుతుబ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించడం నేరమైందని, రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతుందని మండిపడ్డారు.

వైభవంగా మంత్రాలమ్మ షిడే ఉత్సవం



షిడేపై కర్రకు వేలాడుతున్న రాముడు

కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలసిన మంత్రాలమ్మ షిడే బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు షిడే కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సాయంత్రం కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రాలమ్మ తల్లికి ప్రతియేటా నిర్వహించే షిడే సందర్భంగా ఆదివారం భక్తులు పూనకాలు, బోనాలతో గుడిచుట్టు ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కర్రకు పర్లగొర్ల వంశస్థుడైన 70 ఏళ్ల రాముడిని తాడుతో గుడి చుట్టు తిప్పారు.

భారీ బందోబస్తు

మంత్రాలమ్మ షిడే సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా ఎస్‌ఐ గోకారి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు షిడే కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై మొక్కులను తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర

- స్వామివారికి దాసంగాలతో మొక్కులు
- తేరుకు వేలాదిగా హాజరైన భక్తులు



స్వామివారి మూలవిరాట్



ఆకట్టుకున్న పల్లెకోలాటం

ఆత్మకూర్: పట్టణం శివారులోని చెరువు మధ్యలో వెలిసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారి కర్పసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర కమిటీ కన్వీనర్ వెంకటనర్సింహారావు, నిర్వాహకులు సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగునాగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను ఘనంగా చేపట్టారు. గుంటిపల్లి గ్రామస్తుల పల్లెకోళ్ల కోలాటం ప్రత్యేకార్షణగా నిలిచింది.

పల్లకీ సేవ

ఆదివారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా స్వామివారికి మేళతాళాలతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలిదిగా తరలివచ్చారు. సోమవారం రాత్రి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, రవికాంత్, నాగేష్, పరమేష్, తులసిరాజ్, శ్రీను, దామోదర్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

పరమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మొత్తం 40 జట్లు పాల్గొనగా సోమవారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు నగదుతో పాటు షీల్డ్‌లను ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందజేస్తామని వివరించారు.



స్వామివారి రథోత్సవం